

# మూడో సీతకథ

బ్రాహ్మణపిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**నీలాపనిందలు**

వారంరోజులపాటు నన్ను కొట్టు చుట్టూ తిప్పించుకుని కూడా ఇవ్వకుండా, మా అమ్మతో "మీ అమ్మాయి నాప్రాణాలు తోడేస్తోందండీ, ఇలా అయితే నావల్లకాదు!" అని కంప్లెంటు ఇచ్చాడు. దాంతో మా అమ్మ నన్ను నానా భీభత్సంగా తిట్టి, "మళ్ళీ వాడి కొట్టుకెళ్తే చెవులు ఎక్కదీస్తాను!" అని వార్నింగిచ్చింది.

నాకు పిచ్చి కోపం వచ్చి టైలరుగారు భోజనానికి వెళ్ళినప్పుడు కొట్టుకెళ్ళి కొలబద్దనీ, టేపునీ పక్కవాళ్ళ బావిలో పడేసి వచ్చా. (నా గౌను రెడీ అయిందని రూఢి చేసుకున్న తరవాతే అనుకోండి!) అదో పెద్ద గొడవైంది. తరవాజ్జెప్తా.

'కొత్తగౌను' సువాసన మాత్రం మహా మహత్తరంగా వుండేది. ఆ తరవాత పూజాకార్యక్రమం.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. వంటచైడంలో మా అమ్మని 'కొట్టే' వాళ్ళు మా జిల్లాలోనే లేరు. ఛాలెంజ్! ఏ కూర చేసినా ముక్కలన్నీ ఒకే సైజులో వుండాలి. అన్నీ రెడీగా పెట్టుకున్న తరువాతే కుంపటి వెలిగించేది. వినాయకచవితి రోజునైతే ఉండ్రాళ్ళు, అప్పాలూ, బూరెలూ, పాయసం, నువ్వుపప్పు అద్దిన అరిసెలూ, పులిహోర.. ఓహ్!. వాసనకే కడుపునిండిపోయేది.

నా 'చిత్తం' వినాయకుడి మీదా 'భక్తి' భోజనం మీదా వుండేదని చెప్పక్కర్లేదుకదా! ఫుల్లుగా భోజనం 'బిగించాక' పెత్తనాలు మొదలెట్టేదాన్ని.

తొమ్మిది ఇళ్ళల్లో పూజింపబడిన వినాయకుడ్ని చూస్తే, నీలాపనిందలు రావనీ, 'బ్రహ్మాండమైన కలెక్టరు అమ్మా బాబు'లాంటి ఉద్యోగం వస్తుందని మా పిల్లకాయల్లో నమ్మకం వుండేది. అందుకే పెత్తనాలన్నమాట.

ఇక్కడా బ్రేమ్మల ఇళ్ళే. అందరిళ్ళల్లోనూ అవే వుండ్రాళ్ళు అదే పులిహోరా అదే పాయసం. చక్కగా బుల్లిబుల్లి బాదం ఆకుల్తో కుట్టిన టిఫిను విస్తరాకుల్లో పెట్టి తినమనే వాళ్ళు. వద్దని తలాడించేదాన్ని. ఎందుకంటే వాళ్ళ వంటలన్నీ మా అమ్మ వంటముందు బలాదూర్ అని నాకు తెలుసు.

"దానికెందుకే? దానికి 'మన' ఇళ్ళల్లో వంటలెందుకునచ్చుతై? ఏ మిఠాయి నాగభూషణం చేసిన పచ్చిమిర్చి బజ్జీలో, మార్కండేయులు చేసే పిడతకింద పప్పూ, మసాల బజ్జీనో అయితే మింగుతుందిగానీ, 'మడిదడి'తో చేసిన వంటలు దానికెందుకు ఎక్కుతై?" అని పెద్ద సీత అమ్మమ్మావాళ్ళు సణిగేవాళ్ళు. కోపం వచ్చినా వాళ్ళు చెప్పేది 'నిజమే'గాబట్టి ఆ రోజు క్షమించేదాన్ని.

వినాయకచవితి పండగలో పొద్దున్నే జరగాల్సిన తతంగం చెప్పలేదుగదూ! అది 'బూతుపురాణం'. పెద్దవాళ్ళచేత ఎన్ని తిట్లు ఆరోజున తింటే అంతమంచిదనీ, బోల్డంత డబ్బు మనని వరిస్తుందనీ మాకు ఇంకో నమ్మకం. యీ నమ్మకానికి పునాది ఎప్పుడు పడిందో ఎవరు మొదలెట్టారోగానీ, మేం మాత్రం తూ.చా తప్పకుండా పాటించేవాళ్ళం.

పత్రితోపాటు ఓ స్కూలు సంచీ నిండుగా పల్లేరుకాయలు తెచ్చేవాళ్ళం. ఇహ బూతులు ఎవరు బ్రహ్మాండంగా తిడతారో మాకు తెలుసుగనక, తెల్లకి తెల్లవారుఝూమున ఆ 'ఘనాపాఠీ'ల ఇళ్ళముందు యీ పల్లేరుకాయలు చల్లేవాళ్ళం. వాళ్ళు బయటికి రావడం, చూసుకోకుండా పల్లేరుకాయల్ని తొక్కడం, ఇహ బండబూతులు లంకించుకోవడం, వాళ్ళు చేసే విన్యాసాల్ని మేం కొంచెం దూరంలో దాక్కుని చూస్తూ నవ్వుకోవడం. ఇదో మధురఘట్టం.

ఓసారి యీ పల్లేరుకాయలు జల్లే కార్యక్రమంలో నేనూ మద్దిమత్తెనగాడూ పట్టుబడ్డాం. తిట్లతోపాటు మా వీపులు మోత మోగాయనుకోండి. అయితే ఓ చిన్న 'తృప్తి' ఏమంటే, మద్దిమత్తెనగాడ్ని అక్కడే తంతే, నన్ను మాత్రం ఇంటికి వెళ్ళాక మా అమ్మ తన్నింది.

అంత డబ్బు మనని వరించబోతుండగా ఇదోలెక్కా?

ఇహ నీలాపనిందలు. అవెలాగూ తప్పవుకదా! స్కూల్లో చదవకుండా అల్లరిచేస్తున్నాననీ, కిళ్ళీకొట్టు వీరన్నగారి అమ్మాయి అలిమేలుకి అన్యాయంగా తొడపాశం పెట్టాననీ, అసలు నేను ఆడపిల్లనేకాదనీ, ఉత్తి మగరాయుడ్ననీ, ఇలా బోలెడు నీలాపనిందలు వచ్చేవి. ఏదొచ్చినాసరే, "అదికాదే అమ్మా, చవితినాడు పొరబాటున చంద్రుడ్ని చూశాను. అందుకే యీ నింద నామీద పడింది!" అని చాలా అమాయకంగా మొహం పెట్టి కన్విన్స్ చేసేదాన్ని. ఒక్కోసారి వర్కవుట్ అయ్యేది. ఒక్కోసారి 'నో!'

"సాయంత్రం పునఃపూజ తరవాత అక్షింతలు వేశాగా నీ నెత్తిమీద? ఇక నీలాపనిందలు ఎలా వస్తాయి?" అని మా అమ్మ లా పాయింటు తీసేది.

"హూ.! నాన్నకి టిఫిన్ ఇచ్చి, నన్ను నీళ్ళు తెమ్మన్నావు గుర్తుందా? వంగి నేలమీద గ్లాసు పెడుతుంటే ఆ అక్షింతలన్నీ రాలిపోలేదూ?" అంటూ నేను 'కౌంటర్' పాయింట్ కొట్టేదాన్ని. మా అమ్మ తెల్ల మొహం వేసుకుని నా వంక చూస్తుంటే, మా నాన్న గట్టిగా - అలిసిపోయేదాకా నవ్వేవాడు.

"ఒసే బుజ్జులూ! నిన్ను ఖచ్చితంగా లాయర్ని చేస్తానే!" అని గారాబంగా ముద్దుకూడా పెట్టేవాడు .

వినాయకచవితివల్ల స్కూలు పిల్లలకి దక్కే మహదానందం మరోటి ఉంది. ఏమంటే, పుస్తకాలు అన్నిటిమీదా స్వస్తిక్ గుర్తుని పసుపుతో పెట్టి, మధ్య కుంకుమతో బొట్లుపెట్టి, వాటన్నిట్నీ పూజలో పెట్టడం.

దాంతో రెండురోజులవరకూ చదువూ, హోమ్‌వర్కూ బంద్. చవితిగనక ఆదివారం వస్తే మంగళవారం కూడా చదువు బంద్.

"హోమ్‌వర్కు చేసుకురాలేదేం?" అని ఏ మాస్టరు అడిగినా,

"పుస్తకాలన్నీ పూజలో వున్నాయి సార్. ఇంకా పత్రి నిమజ్జనం జరగలేదు!" అని ఢంకా బజాయించి చెప్పేవాళ్ళం. కాదనటానికి గుండె - చెరువా?

వినాయకచవితి రోజున అంటే నా ఏడో ఏడప్పుడు జరిగిన విషయం చెప్పకపోతే, అది ఎప్పటికీ మీకు తెలీదు. అందుకే చెప్తున్నా, అంతకుముందులాగే ఆ యేడూ మా అమ్మతో కలిసి, తొమ్మిది మంది బ్రేమ్మల ఇళ్ళల్లోనూ గణపతి దర్శనం చేసుకున్నా. ఆ తరువాత మా అమ్మని కాకాపట్టి నా ఫ్రెండ్స్ ఇళ్ళని కూడా విజిట్ చేశా. చివరి ఇల్లు మధూగాడిది. ఆరోజున వాడికి ఏం బుద్ధిపుట్టిందో ఏమో, "ఒసేయ్ సీతా! చాలా మంచిదానివీ, గ్రేటు వీ నే! ఇవాళ మీ యింట్లో వినాయకుడ్ని చూపించవా?" అని మహా వినయంగా అడిగాడు.

"ఎందుకురా! మీ యింట్లో కూడా పూజ చేశారుగా!?" అన్నాను.

"అదికాదే! ఈసారి ఇప్పటి వరకు అన్నీ సున్నాలే కదే పాసు కాకపోతే మా నాయన చదువు మాన్పిస్తాడే మీరు బ్రాహ్మలు కదా! మీ ఇంట్లో వినాయకుడ్ని చూస్తే గ్యారంటీగా నన్ను పాస్ చేస్తాడే! ప్లీజ్ సీతా ప్లీజే! " అని బతిమాలాడు. న్యాయంగా అయితే అంతసేపు బతిమాలించుకోను. కానీ నా సమస్య నాది.

"మా అమ్మ తిడుతుందేమోరా! అసలే చచ్చేంత మడీ ఆచారం!" అన్నాను. వాడు వొదిలితేగా. సరే.. వెంటబెట్టుకుని ఇంటికి తీసుకెళ్ళా.

"అమ్మా.! ఇవ్వాళ మధూ మనింట్లో గణపతికి దండం పెట్టుకుంటానన్నాడు. చూపించమంటావా?" అన్నా.

"పాపం పొద్దున కాయలు కూడా కోసిచ్చాడు గదే! తీసికెళ్ళి చూపించు. అయితే కాళ్ళూ చేతులూ బాగా కడుక్కున్నాకే!" అన్నది మా అమ్మ. నా గుండె డుబుక్కుమంది.

"మరి పునఃపూజ ఇంకా కాలేదుగా?" కొంచెం అడ్డుపుల్లవేసే ప్రయత్నం చేశా.

"దాన్దేముందీ! అదెప్పుడో సాయంత్రం కదా!" తేల్చేసింది మా అమ్మ.

"పదరా!" అన్నాను నీరసంగా. వాడులోపలికి రావడం రావడం పాలవెల్లికి కట్టివున్న పెద్ద పెద్ద వెలక్కాయల్నీ, సీతాఫలాల్నీ, మొక్కజొన్నపొత్తుల్నీ చూడ్డం జరిగిపోయింది.

"నా సంచిలో పెద్దకాయలన్నిట్నీ దొంగతనం చేస్తావుటే ద్రోహీ! నువ్వు ఇంత నమ్మకద్రోహం చేస్తావని తెలీకేగదే నీతో స్నేహం చేసిందీ!" అని దండం కూడా పెట్టకుండా ఏడుస్తూ బయటకి పరిగెత్తాడు. అవన్నీ వాడి సంచిలోంచి కొట్టుకొచ్చినవేగా!

ఆ మాట విన్న మా అమ్మ నా వంక చూసిన 'చూపు' ఎలాంటిదో నేను వర్ణించలేనుగాక వర్ణించలేను.

ఆ విషయం అక్కడితో ఆగలా. చాలా ఉపద్రవాలు జరిగాయి. మధుగాడి దగ్గర కొట్టేసిన వెలక్కాయిల్లో పెద్దవి కొన్ని జోగ్గాడికి లంచం ఇచ్చి తామరపువ్వులు సంపాయించా. వాడ్ని మంచి చేసుకోకపోతే ఆ రోజు నాకు 'ఫ్రీ'గా తామరపువ్వులు దొరకవు. ఎందుకంటే, పెద్ద చెరువుకి కాపలాదారు వాళ్ళ నాన్నే. ఆ చెరువులో ఎవర్నీ దిగనిచ్చేవాళ్ళు కాదు. జోగ్గాడి దగ్గర్నించి పువ్వులు రాబట్టాలంటే ఏదో ఒకటి ఎక్స్‌చేంజ్‌గా ఇచ్చి తీరాలి.

మా ఇంట్లోంచి ఏడుస్తూ వెళ్ళిన మధూగాడు, సరాసరి జోగారావు ఇంటికెళ్ళి, వాడిగోడు వెళ్ళబోసుకుంటూ, అక్కడ పెద్ద వెలక్కాయలూ, సీతాఫలాలూ చూసి, "నువ్వూ, ఆ సీతా నాకు ద్రోహం చేస్తార్రుటా?" అని యుద్ధానికి దిగాట్ట. ఆ తరువాత వాళ్ళిద్దరూ ముష్టాముష్టీ బాహాబాహీ రాజనాలా కాంతారావు లెవెల్లో కొట్టుకున్నారుట. దాంతో ఊరంతా ఫలానా సీత 'మిత్రద్రోహం' చేసి మధుగాడి సంచిలో కాయలు కొట్టేసిందని ప్రచారం జరిగింది.

బ్రేమ్మల పిల్లని గనక నన్ను ఎవరూ మొహం మీద అనకపోయినా నన్నో 'గజదొంగ' లెవెల్లో చూడ్డం మొదలెట్టారు. ఇద్దరు ముగ్గురు అమ్మలక్కలైతే, "జాగ్రత్తమ్మా! ఆ పిల్ల మహా గజదొంగని నాకు ముందే తెలుసు. మా మనవడి చేతిలో 'నిమ్మతొన' (మిఠాయి) అది కొట్టేస్తుంటే నేను కళ్ళారా చూళ్ళేదూ!" అని కూడా అన్నారు. ప్రాణం పోయినా యీ 'సీత' అలాంటి పనిచెయ్యదని వాళ్ళకేం తెలుసూ!

ఎక్కడికెళ్ళినా, "ఏమే సీతా! దొంగతనం చేశావుటగా!" అనేవాళ్ళు. ముఖ్యంగా బ్రేమ్మలు.

అవన్నీ బాలోరిగూడెం నించీ భట్టోరిగూడెం నించీ కోసుకొచ్చినవనీ, దారిలో అన్ని గోనెసంచులూ ఒకేలాగ వుంటాయి గనక మధుగాడి సంచీ నా సంచీ మారిందనీ" - అడిగిన వాళ్ళకి అడగని వాళ్ళకి కూడా 'వివరణ' ఇచ్చి ఆ నీలాపనిందని చాలామటుకూ తొలగించుకోగలిగానుగానీ, మా అమ్మ మాత్రం నేను చెప్పిన సదరు 'విషయాన్ని' నమ్మినట్టు కనిపించలా, వాదాలు జరిగినా! మా నాన్న మాత్రం, "భలే వాదించావే సీతా.! నిన్ను లాయరీ చదివిస్తా" అని మెచ్చుకున్నాడు.

"ఇదా? ఇది ప్లీడరీ చేస్తుందా? చూస్తూ వుండండి, ఏనాడో ఓనాడు ఓ పేద్ద గజదొంగై బ్యాంకుల్ని లూటీ చేస్తుంది!" అంటూ మా అమ్మ మటమటలాడింది.

ఏమైనా ఆ యేటి 'చవితి' మాత్రం నేను జన్మలో మర్చిపోని అనుభవాన్నిచ్చింది.

***పాకబడి***

నాకు తొమ్మిదేళ్ళు వచ్చేసరికల్లా అయిదోతరగతికి వచ్చేశా. "అదేంటీ?" అని మీరు అడగొచ్చు. ఆ రోజుల్లో అయిదేళ్ళు వచ్చేదాకా స్కూల్లో వేసేవాళ్ళుకాదు. 'చైత్రమూ వైశాఖమూ' అంటూ ఇంట్లోనే ఏదో ఓ చదువుచెప్పేవాళ్ళు. అదీ బ్రాహ్మల ఇళ్ళల్లో. మిగతా వాళ్ళకి అదీలేదు హాయిగా తినటం తిరగటం ఆడుకోవటం.

"మా అబ్బాయిని ఆర్ అమ్మాయిని బళ్ళో వేస్తున్నాం. మా ఇంటికి రండి" అని ఓ చిన్నపాటి ఆహ్వానంతో బడి ప్రహసనం మొదలయ్యేది. మాస్టారు మిగతా స్కూలు పిల్లల్తో సహా ఇంటికి వస్తారు. నా విషయంలో అయితే, నాకు కొత్తగౌను కుట్టించి ముస్తాబు చేశారు. వాకిట్లో చాపలూ బల్లలు వేయించారు. మా అమ్మ పేద్ద సత్తు తపేళాలో జీడిపప్పు ఉప్మా, పెద్దవాళ్ళకి కాఫీలూ, పిల్లలకి నిమ్మకాయ షర్బత్తూ, ఇంకా పంచిపెట్టటానికి లడ్డూలు చేగోడీలు చేసింది.

మా నాన్న ఒళ్ళో కూర్చోబెట్టుకుని, ముందు పళ్ళెంలో వున్న బియ్యం మీద తరువాత చక్కగా పరిచిన తెల్లని తమ్మిలేటి ఇసుకమీదా, 'ఓ నా మహాశివాయహా' అంటూ నా వేలు పట్టుకుని వ్రాయించారు.

ఆ తరువాత పిల్లలకీ, పెద్దలకీ జీడిపప్పు ఉప్మా మరియూ కాఫీ షర్బత్‌ల పంజారం జరిగింది. ఆ తరువాత స్కూలు పిల్లలందరికీ లడ్డూలు చేగోడీలు పంచబడ్డాయి. మేస్టారికి పేంటూ షర్టూ నిమిత్తం జల్లిపల్లి వారి కొట్లోంచి కొనుక్కొచ్చిన గుడ్డలు, పళ్ళూ తాంబూలంతో సహా ఇవ్వబడ్డాయి.

ఈ ఘనమైన కార్యక్రమం అంతా నా నాలుగోయేట జరిగింది. ఆనాడే నేనో స్కూలు దాన్నైయ్యా.

మొదట్లోనే చెప్పాగా మా ఊరి వివరాలు. మేడబడి మా ఇంటికి దూరం. సుబ్బరాజుగారి బడి మంచిదేగానీ, రోడ్డెక్కాలి. చిన్నపిల్ల రోడ్డుమీద నడిస్తే ఎన్ని ప్రమాదాలు జరుగుతయ్యో అని, మా ఇంటికి నాలుగిళ్ళ అవతల వున్న ఓరుగంటి సీతారామయ్యగారి గొడ్లపాకలో నడిచే ఏలియా మాస్టారి బడికి పంపటానికి మావాళ్ళు సుముహూర్తం నిర్ణయించారు.

ఓ సరి కొత్త పలకా, ఓ సరికొత్త తెల్ల బలపం (నల్ల బలపాలు చీపు) పట్టుకుని మా నాన్న వెంట నేను స్కూలికి నడిచా.

"నీ పేరేంటమ్మా?" అడిగారు ఏలియా మాస్టారు. ఆయనకి తెలీదా నా పేరూ?

"మొన్నేగదా చెప్పానూ..'సీత' అనీ!" సహజమైన చికాకు స్వరంతో అన్నాను. ఆయన మొహం చూడాలీ.!

"అవునవును.. సీతకదూ! ఇలా కూర్చో!" అంటూ ఓ చోటు చూపించారు.

నాకు అక్షరాభ్యాసం చేసింది శుక్రవారం. సరే! ఆ రోజూ, శనివారం రోజూ, ఆదివారం రోజూ మా అమ్మ నన్ను క్షణం తీరికలేకుండా కొంపలో కూచోబెట్టి 'అ' నించి 'అః' దాకా అక్షరాలు దిద్దించింది. నా వేళ్ళు దిద్ది దిద్దీ వాచిపోయాయి. దేవుడు నాకు తెలివితేటలు ఎక్కువే ఇచ్చాడని ఆరోజున నాకు తెలీదుగానీ, నేడు ఘంటాపథంగా చెప్పగలను.

"నీకేమన్నా అక్షరాలు వొచ్చా? వొస్తే రాసి చూపించు!" అని, ఏదో ఓ ప్రశ్న అడగాలిగనక అడిగారు.

పలకమీద దిద్దీ దిద్దీ గీతలు పడివున్నై. ఆ గీతల్ని ఫాలో అయిపోయి 'అః' వరకూ రాసేశా. ఇది కాస్త 'ఎక్కువ'గా అనిపించవచ్చు. అప్పుడు జరిగిన సంఘటనని ఇప్పుడు చెబుతున్నా గనక కాస్త 'డబ్బా' కొట్టుకున్నాననీ మీరు అనుకోవచ్చు. కానీ ఇది

పచ్చినిజం. మొన్న మొన్నటిదాకా 'ఏలియా' మాస్టారే అనేవారు "సీతా! జన్మలో మూడురోజుల్లో అఆలు నేర్చుకున్న దాన్ని నిన్నే చూశాను"! అని. అంతెందుకూ? మా పెద్దపుల్లేటికుర్రులో ఇప్పటికీ ఆ విషయాన్ని నా క్లాస్‌మేట్స్ మరిచిపోలా.

అప్పట్నించీ ఏలియా మాస్టారు నా గురించి 'ప్రత్యేక' శ్రద్ధ తీసుకున్నారు. మిగతా వాళ్ళకి నాలుగు అక్షరాలు హోమ్‌వర్కు ఇస్తే నాకు మొత్తం 'గుణింతాలు' హోమ్‌వర్కు ఇచ్చేవారు. అంతేకాక నన్ను తెగ మెచ్చుకునేవారు కూడా.

సరే మళ్ళీ స్కూల్లో అడుగు పెట్టిన మొదటిరోజుకి వద్దాం. మా స్కూలు గొడ్లపాకలో నడిచేదని ముందే చెప్పానుకదా. ఎందుకో అవాళ గేదెల్నీ ఆవుల్నీ 'గొడ్లకాడిబుడ్డాడు' మేతకి తోలుకెళ్ళలా. అవన్నీ ఓ పక్క కట్టబడివున్నాయి. కొద్దిగా జల్లు మొదలైంది. దాంతో మేం బాగా పాక లోపలికి జరిగాము. ఆరోజుల్లో స్కూలు అంటే ఏవుందీ? గవర్నమెంటు స్కూలు, సంగతి వేరు. ప్రయివేటు స్కూళ్ళు ఎక్కువ. అయిదో తరగతిదాకా అందులో చదివి, ఫస్టు ఫాం అంటే ఆరోతరగతిలో చేరడానికి ఎంట్రన్స్ పరిక్ష రాయాల్సి వొచ్చేది. ఏలియాగారు ఎక్కడ్నించో వచ్చి స్కూలు పెట్టుకుంటాననీ పిల్లల్ని పంపించమనీ పెద్దవాళ్ళని బతిమాలితే, సరేనని మమ్మల్ని అక్కడ చేర్చారు. ఇంటికి అది దగ్గరకూడా.

మొత్తం ఓ పదిమంది వుండేవాళ్ళం. నేనూ, అమ్మాజీ, సత్యవతీ ముగ్గురం అమ్మాయిలం. మిగతా ఏడుగురూ మొగపిల్లలు. అంటే, మద్దిమత్తెనగాడూ, మధూ, జోగారావూ, పార్వతీశం, డొంకాడ వెంకట్రావూ, మరో ఇద్దరు. వాళ్ళ పేర్లు ఘంటా గంగాధరరావూ, సింహాద్రీ. మళ్ళీ కథకొస్తే - మేం బాగా పాకలోపలికి జరగటంతో ఓ గేదె తన పవిత్రమైన పేడని అమ్మాజీ పలక మీద వేసింది, ఇహ నవ్వాం చూడండీ!.! పాపం అమ్మాజీ ఆ సాయంత్రం గట్టిగా ఏడ్చి 'ఆ స్కూల్లో చదవను పొమ్మంది.' వెళ్ళినరోజే ఫ్రెండ్ అయింది నాకు. ఆ విషయం మా నాన్నతో చెప్పి తెగ నవ్వుతుంటే, "నోర్ముయ్ నవ్వు నాలుగువిధాల చేటు!" అని మా అమ్మ నా చెవులు మెలేసింది. అప్పటికింకా మా అమ్మతో గొడవలు పడే ధైర్యం నాకు లేదనుకోండి.

పాపం ఏలియా మాస్టారు అమ్మాజీ వాళ్ళ నాన్నగార్ని బతిమలాడి ఆ పిల్లని మళ్ళీ మా స్కూల్లోకి తీసుకొచ్చారు.

అయిదో తరగతిదాకా అక్కడే చదివా. అప్పట్లో 'ఫస్ట్‌ఫాం'లోగానీ ఇంగ్లీషు మొదలెట్టేవారు కాదు. కానీ ఏలియా మాస్టారు నా మీద చూపిన శ్రద్ధవల్లా, మా నాన్న ఉత్సాహంవల్లా 'ఏబీసీడీ' నాలుగు 'బళ్ళూ' అయిదోతరగతిలోనే నేర్చుకున్నా. పాపం తెల్లార్లూ మమ్మల్ని రుద్దీ రుద్దీ ఎంట్రెన్సు పరీక్షలకు ఏలియాగారు సిద్ధం చేశారు. నేను అయిదో తరగతికొచ్చేసరికి 'ఏలియ బడి' స్ట్రెంక్త్ ఇరవై అయిదుకి పెరిగింది. మాదే మొదటి బాచ్ గనక మొత్తం పదిమంది ఎంట్రన్స్‌కి పరీక్ష రాశాం. ఎంట్రన్స్ పరీక్ష అంటే చాలాకష్టం అనుకున్నాం గానీ చులాగ్గానే పాసయ్యాం.

ఇహ ఆ రోజున మా హుషారు చూడాలి. హైస్కూలు బోర్డుమీద ఓ పిన్నుతో కాయితాలు గుచ్చారు. దాదాపు ఇరవై ప్రయివేటు స్కూళ్ళవాళ్ళు వాళ్ళ స్టూడెంట్స్‌తో ఎంట్రన్స్ పరిక్ష రాయించారు.

నూటికి నూరుశాతం ఎంట్రన్స్‌లో పాసైంది మాత్రం మా 'ఏలియా బడి' వాళ్ళమే. మా మాస్టారైతే కళ్ళెంట నీళ్ళుపెట్టుకుని, "పరువు నిలిపార్రా పిల్లలూ!" అంటూ నివషానికోసారి మమ్మల్ని కావలించుకున్నారు. ఇంతకీ ఆయన వసూలు చేసేది నెలకి రూపాయి. అదీ ఇచ్చిన వాళ్ళెంతమందీ! మా నాన్న మాత్రం ఖచ్చితంగా నెలకి రూపాయీ చెల్లించడంతోబాటు, బియ్యం, పప్పూ చింతపండూ ఎండు మిర్చీ నూనెలాంటివి కూడా నెలనెలా పంపేవాడు. అప్పటికి ఏలియా మాస్టారికి పెళ్ళికాలా. ఇరవైరెండేళ్ళ (అప్పట్లో ఆయన వయసు తెలీదు) కుర్రాడు. ఎర్రగా వుండేవారు. నవ్వు మొహం. పిల్లల్ని చితగ్గొట్టి అయినా చదివించేవారు.

మేం ఎంట్రన్సు పాసైన రోజున మాత్రం మా నాన్న ఆయనకి బట్టలు పెట్టి, "మాస్టారూ, మీ తరుఫునించి విద్యాశాఖకి మీ స్కూలుకి ఫండ్ ఇచ్చేలా కరెస్పాండెన్సు చేస్తాను!" అని భుజం తట్టారు. (అయ్యా, ఆ ఏలియా మాస్టారు పుణ్యం కట్టుకోబట్టే, మా వీధికో గవర్నమెంటు స్కూలు అంటే 'ఎయిడెడ్‌ది' వచ్చింది. చాలా ఏళ్ళు ఆయన మా వూళ్ళోనే పనిచేశారు. పెళ్ళిచేసుకున్నారు - బిడ్డల్నీ

కన్నారు. డిగ్రీ కూడా ప్రయివేటుగా కట్టిపాసై, ట్రైనింగ్ పూర్తిచేసుకుని మరో 'హైస్కూల్లో'కి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారు. ఆయన ఇప్పుడెక్కడున్నదీ తెలిస్తే ఆయన పాదాలకి సాష్టాంగ నమస్కారం చెయ్యనూ!)

"ఇప్పుడు 'మనం' హైస్కూలు స్టూడెంట్!"

ఈ మాటే నా గౌన్ భుజం మీదవుండే 'బుట్ట'ని ఎగరేసి నేను అన్నది. అప్పట్లో 'బుట్ట జాకెట్లూ' 'బుట్టగౌన్లూ' వుండేవి. అదో ఫేషన్. ఆమాట మామూలుగా అని వూరుకుంటే బాగానే వుండేది, "ఒసే భాగ్యం, ఇవాల్టినించీ నన్ను తిట్టకుండా కొట్టకుండా జాగ్రత్తగా చూసుకో!" అని కూడా అన్నాను.

భాగ్యం అంటే మా అమ్మ. పూర్తిపేరు భాగ్యలక్ష్మి.

"ఏవన్నావే భడవా? నన్ను పేరు పెట్టి పిలుస్తావా? ఎంత ధైర్యం? ఇవాళ నీకాళ్ళు విరగ్గొట్టక పోతే నేను మాలక్ష్మి కూతుర్నేకాదు!" అంటూ మా అమ్మ 'ఇంతెత్తున' లేచింది.

"ఏం చేస్తావే మాలక్ష్మి కూతురా.! నువ్వేదన్నా చేస్తే నేనూరుకుంటానా? ఊరుకుంటే నేనూ భాగ్యలక్ష్మి కూతుర్ని కాదు! జాగ్రత్త!" అని అరిచా. ఏవన్నా అనుకోండి. తల్లులంత పిచ్చోళ్ళు సృష్టిలో వుండరు. ఎప్పుడైతే నేను 'భాగ్యలక్ష్మి' కూతుర్ని అన్నానో అప్పుడే ఆవిడకోపం చటుక్కున దిగిపోయి, "ఎంతమాటన్నావే సీతా! నువ్వు నా బంగారు తల్లివికాదూ. మా ఇంట వెలిసిన సరస్వతివి కాదూ!" అంటూ నన్ను కావలించుకుని తెగముద్దులు పెట్టింది.

ఇహ మానాన్న హడావిడి చెప్పక్కర్లా. ఏదో పనిమీద బెజవాడ వెళ్ళి అక్కడ్నించి వస్తూ 'నైలాన్' రెడీమేడ్ గౌన్లు కొనితెచ్చాడు. అంతేకాదు వాటికి తోడుగా ఇచ్చే లో దుస్తులు కూడా.

"అంత ఖరీదువి ఎందుకూ ఎదిగే పిల్లకి?" అని మా అమ్మ కొంచెం మా నాన్నని కోప్పడింది కానీ, అవివేసి సరిపోతాయా లేవా అని చూసినప్పుడు మాత్రం "మహారాణిలా వున్నావే. నా దిష్టే తగులుతుందేమో నీకు!" అని గబగబా ఉప్పూ ఎండు మిరపకాయల్తో దిష్టితీసి పొయ్యిలో పడేసింది. దిష్టి సంగతేమోకానీ మా వీధిలో వాళ్ళంతా తుమ్ములే తుమ్ములు. నా కయితే ఆ ఘాటుకీ పొగకీ కళ్ళేరబడి కన్నీళ్ళొచ్చాయి. "తెలుస్తూనే ఉందిగా, బోలెడు దిష్టితగిలిందనీ!" అని తృప్తిగా మా అమ్మ మెటికలు విరిచింది. అప్పట్లో 'నైలాన్' కొత్తగా వచ్చింది. వాటిని కట్టుకున్న వాళ్ళమీద మొదట 'చిన్నచూపు' వుండేది. కొంతమంది వాటిని 'దేవతా వస్త్రాలు' అనేవాళ్ళు. ఏ ఆడదైనా నైలాన్ చీరలు కడితే, "ఏం షోకిల్లానమ్మా! వొళ్ళు చూపించుకుంటూ తిరుగుతోంది.! ఆడదేనా? ఆడపుటక పుట్టిందేనా?" అని ముక్కులూ మూతులూ విరిచేవాళ్ళు. ఆ తరువాత అదో చిన్న 'స్టేటస్' సింబలైంది. దాంతర్వాత 'టెర్లిన్' ఆ తరవాత 'టెరీకాట్' ఇండియాని ముంచెత్తాయి.

మా వూళ్ళో మొట్టమొదటిసారిగా నైలాన్ గౌను తొడిగింది నేనే. "నేనయితే చచ్చినా వాటిని కట్టను!" అని రెండో సీత అన్నదిగానీ, మూణ్నెల్లలోపే లంగా ఓణీ జాకెట్టూ నైలాన్‌వి కొనిపించి, "యీ డ్రెస్సులో నేను ఎలా వున్నానే? దేవికలాగా లేనూ?" అని మురుసుకుంది.

హైస్కూలంటే 'పాకబడి' కాదుగదా! అక్కడయితే అన్ని క్లాసులకీ ఒకే మాస్టారు. ఇక్కడయితే ఏ సబ్జక్టుకి ఆ టీచరే. తొమ్మిదింటికి ఫుల్లుగా వేడివేడి ఫుడ్డు 'బిగించి', తొమ్మిదిన్నరకి మా నాన్న సైకిలు కేరేజీ మీద ఎక్కితే పావుగంటలో హైస్కూలు చేరొచ్చు. మా నాన్న లాయరుగదా.. వాళ్ళ మేజిస్ట్రేటు కోర్టూ మా స్కూలికి దగ్గరే. గనక మధ్యాహ్నం మళ్ళీ ఇంటికొచ్చి 'దబదబా' అన్నంతినేసి మళ్ళీ నాన్న సైకిలు మీద స్కూలికి. సాయంత్రం ఇద్దరం కలిసే వొచ్చేవాళ్ళం. మా నాన్నది 'హంబరు' సైకిలు. హంబరు సైకిలంటే చాలా 'గొప్ప' సైకిలన్నమాట. ఆ కంపెనీ సైకిలు కోసం మాములు సైకిళ్ళకంటే చాలా ఎక్కువ 'డబ్బు' పెట్టాలన్నమాట.

"సైకిలు గురించి రాస్తోందేం?" అని మీరు కాస్త చికాకు పడొచ్చు. కానీ స్కూలు ముందర, స్కూల్లో స్టూడెంట్సు ముందర, ఓ పిల్ల అంటే, 'ఈ సీత,' హంబరు సైకిలు దిగిందంటే ఎంత గ్రేటు! చాలామంది నన్ను చూసి కుళ్ళుకునేవాళ్ళు! అదే మామూలు సైకిలు మీంచి దిగితే ఆ హోదా, ఆ గౌరవం వస్తాయా?

నా మొట్టమొదటి క్లాసు, అంటే 'పీరియడ్' తెలుగు పీరియడ్ టీచరుగారి పేరు సూర్యారావుగారు. మహా హుషారు మనిషి. బ్రహ్మాండంగా పద్యాలు చదివేవాళ్ళు. పాతాలైతే మళ్ళీ చదవక్కర్లా. ఎంతయినా 'పాకబడి' వాళ్ళం అంతా ఒకటి గనక మేం పదిమందీ వరసగా కూర్చున్నాం. నాకు ఇటుపక్క మధుగాడు అటుపక్క జోగారావు. మేం తప్ప మిగతావాళ్ళంతా విడివిడిగా అంటే ఆడపిల్లలు ఓ వైపూ మగపిల్లలు ఓ వైపూ కూర్చున్నారు. ఆయన వచ్చీరాంగానే, "నీ పేరేమిటమ్మాయ్?" అన్నారు.

"సీతండీ" అన్నాను.

"ఇకనించీ ఇట్లా మగపిల్లల మధ్య కూర్చోకూడదు. అటువైపు వెళ్ళి కూర్చో!" అన్నారు.

"అయిదోక్లాసుదాకా ఇలాగే కూర్చున్నాం కదండీ!" అన్నాను.

"అదివేరు. ఇది హైస్కూలు. ఇక్కడ విడివిడిగానే కూర్చోవాలి!" అన్నారు.

ఇహ నాకు తప్పలా. ఆయన అందరి పేర్లూ అడిగి వరసగా అటెండెన్సు రిజిస్టర్లో రాశారు. నంబర్లు కూడా కేటాయించారు. నా నంబరు నాలుగు. నాకంటే ముందుది అమ్మాజీది అంటే నంబర్ త్రీ అన్నమాట. నంబర్ వన్ పుష్పకుమారి, నంబర్ టూ విజయలక్ష్మి. నా తరవాత నెంబరు అంటే నంబర్ ఫైవ్ జయలక్ష్మిది.

ఇంటర్వెల్ బెల్ కొట్టంగానే మధూగాడూ జోగ్గాడూ ఏడుపు మొహాలు పెట్టి, "ఇదేం అన్యాయమే సీతా?" అన్నారు.

"ఫరవాలేదురా! ఎక్కడ కూర్చుంటే ఏం? అందరిదీ 'ఏ' సెక్షనేగా!" అన్నా ఓదారుస్తూ.

"అదికాదే రేపు పరీక్షలప్పుడు నీ ఆన్సరు పేపర్లోంచి కాపీకొట్టడం కుదరదుగదే!" అని ఏడుపు మొహంతో తల వేలాడేశారు.

ఓర్నీ ఇదా వీళ్ళ ఏడుపుకి కారణం. నా దగ్గర కూచోడం కోసం కాదన్నమాట.! కాపీ కొట్టడానికి వీల్లేదని వాళ్ళ ఏడుపన్నమాట.

"ద్రోహుల్లారా! అదంతా స్నేహమనుకున్నా. హూ.! మీ నిజస్వరూపాలు ఇప్పుడు తెలిసినై!" ఓ డైలాగ్ కొట్టాను.

(ఈ పెద్ద పెద్ద మాటలు ఎవరు నేర్పారని అడక్కండి. మా వూరి టూరింగ్ టాకీసులో సినిమా చూసి నేర్చుకున్నవే!)

పదిరోజుల్లో 'స్కూలు' అలవాటైపోయింది.. మొత్తం స్కూలు కబుర్లన్నీ మా అమ్మకి తూ॥చా॥ తప్పకుండా చెప్పేదాన్ని. సాయంకాలం ఆటలు మాత్రం మా 'పాకబడి' బేచ్‌తోనే!

నేను ముందరే 'మనవి' చేశానుగా, నేను కావాలని తప్పులు చెయ్యననీ, వాటంతట అవే జరిగిపోతాయనీ! స్కూల్లో చేరిన నెలరోజుల్లో పెద్ద గొడవైంది. ఆ గొడవకి కారణం నేను కాకపోయినా, (అంటే నేను కావాలని చెయ్యకపోయినా) మొత్తం నీలాపనింద అంతా నా నెత్తిన పడింది. అదేమిటో చెప్పేముందు మీకు ఓ విషయం తప్పక చెప్పాలి. ఏ పండగన్నా మానెయ్యండి వినాయకచవితికి పూజచెయ్యటం మానారో..., అంతే సంగతులు! 'ఆ'!

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments